# స్వభావం

"ఏమండీ!" అన్నది రోహిణి.

"ఏమిటి?" అన్నాడు గోవిందాచారి.

"ఒక పనిమనిషిని మాట్లాడండి. ఈ చాకిరి బొత్తిగా నేను చేయలేక పోతున్నాను" అన్నది రోహిణి. ఆమెను రెండు వారాలనుండి వొంట్లో సుస్తీగా వుంటున్నది.

"నాకు తెలుసు రోహిణీ. కాని నా సంపాదన పని మనిషిని పెట్టటానికి చాలదు" అన్నాడు గోవిందాచారి, అతనికి ఏదో చిన్న షాపులో నెలకు యాభై రూపాయ లిస్తుంటారు. ఆమాట పైకి అనటానికి గోవిందాచారి ఎంతో బాధ పడ్డాడు.

"నేను చాలా దరిద్రుణ్ని. కట్టుకొన్న భార్య చిన్నకోరిక కోరితే అది తీర్చలేని అసమర్థుణ్ని" అన్నాడు గోవిందాచారి. అట్లా అంటున్నప్పుడు అతని గొంతు కొలమారింది. వాళ్ళు ఒకరి నొకరు కావాలని పెళ్ళిచేసుకున్నారు. రోహిణి కాపరానికొచ్చి నాలుగు నెలలయినా కాలేదు. ఆ పిల్ల భర్తను కష్టపెట్టటం ఇష్టంలేక అట్లాగే ఇంటిపనంతా చేయలేక చేయలేక చేసుకుపోతున్నది.

ఒకరోజు మధ్యాహ్నం ఇంటికొచ్చాడు. రోహిణి మూలుగుతూవుంది. నుదురు టకటకలాడుతున్నది. పొట్ట కాలిపోతున్నది. వెంట్రుకలు చిందర వందరగా ముఖంమీద పడివున్నయ్.

"ఏమిటమ్మా!" అన్నాడు గోవిందాచారి బుజ్జగిస్తూ. అతను అతి ప్రేమగా వున్నప్పుడు భార్యను 'అమ్మా' అని పిలుస్తాడు. మంచంమీద కూచుని ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

"నీళ్లు తోడుతూ తోడుతూ పడిపోయాను" అన్నది రోహిణి. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కొద్దిగా ఆయాసపడింది. ఆమాట అంటున్నప్పుడు గొంతులో శోకం రానున్న సూచనలు కనిపిస్తున్నాయి.

"ఇప్పుడే వొస్తాను"

"ఎక్కడికి?" అన్నది రోహిణి.

"పనిమనిషి కోసం!"

"ఎండలోనా? సాయంత్రం పోదురుగానిలెండి!" అన్నది రోహిణి. ఆమె భయపడింది. గోవిందాచారికి ఎండలో తిరిగితే జబ్బుచేస్తుంది. ఒకసారి ఆమెతో కీచులాడి, సాయంత్రానికి పుట్టెడుజ్వరంతో కసుకుసులాడుతూ ఇంటికొచ్చాడు.

"ఫర్వాలేదు" అని బైటికొచ్చాడు. అతనికి పనిమనుషులు ఎక్కడ దొరుకుతారో ఖచ్చితంగా తెలియదు. ఆఫీసులో పనిచెయ్యటం, భార్యతో కలసి అన్నం తినటం, ఆమెను ఎగతాళి పట్టించటం, పలచగా నవ్వే ఆమె ముఖాన్ని చూస్తూ శరీరం మరవటం తప్ప అతని కేమీ తెలియవు.

"పనివాళ్లు ఎక్కడ దొరుకుతారు?" అన్నాడు గోవిందాచారి వొకనితో. అతను కాసేపు గోవిందాచారిని, ఎగాదిగా చూసి 'సోది అడుగు' అని వెళ్ళిపోయాడు.

గోవిందాచారి పనిమనిషికోసం వూరంతా తిరిగాడు. ఎక్కడా దొరకలేదు. పనిమనిషిని గుర్తుపట్టడం అతనికి అసాధ్యంగా వుంది.

హఠాత్తుగా అతనికి యానాదివాళ్ళుజ్ఞాపకమొచ్చారు. ఎండలో తిరిగి తిరిగి, ఒక హోటల్లో కాఫీ తాగుతున్నాడు గోవిందాచారి. అక్కడ కప్పులు తియ్యటానికి యానాదివాడొచ్చాడు. యానాదివాళ్ళు పనిమనుషులు. యానాదివారు ఎక్కడ వుంటారో అతను తెలుసుకొన్నాడు. అక్కడకు వెళ్ళాడు. పాతిక గుడిసెలకంటే ఎక్కువగా లేవు. అవీ అనారోగ్యంగా, దుర్గంధంగా వున్నయ్.

చిటికేశ్వర చెట్టుకింద వొకడు కూచుని 'పులిజూదం' ఆడుతున్నాడు. గోవిందాచారి వాణ్ణి పలకరించాడు.

"ఏమిటండీ?" అన్నాడు యానాది.

"పనిచేస్తావా?"

"చెయ్యను" అన్నాడు యానాది.

"ఊరికేకాదు..."

"డబ్బులకైనా..." అన్నాడు యానాది.

యానాదివాళ్ళు పని చెయ్యరని గోవిందాచారి అనుకొన్నాడు. ఇక ఈ పూటకు తను తిరగలేడు. ఒళ్లు కాలిపోతూ వుంది. తల నొప్పిగావుంది. ఇంటికొచ్చాడు. అప్పటికి రోహిణి లేచింది. మెల్లిగా సాయంత్రంపని చేస్తూవున్నది.

...ప్రొద్దుపోయింది. గోవిందాచారి అరుగుమీద పడుకొని వున్నాడు. శరీరం బదువెక్కినట్లుగావుంది. బిర్రుచొక్కా

తొడుక్కొన్నట్లుగా వుంది. మెదడులో మేకులు గుచ్చుకొన్న ట్లుగా వుంది.

"అమ్మా!" అని బిచ్చగాడు అరిచాడు.

"వెళ్ళవోయ్ వెళ్ళు" అన్నాడు గోవిందాచారి. అతను బిచ్చగాళ్ళను ఎప్పుడూ వెళ్ళమనే అంటాడు.

"ఉండ మనండీ పాపం!" అన్నది రోహిణి. బిచ్చగా ళ్ళంటే రోహిణి జాలిపడుతుంది. బిచ్చగాడు వున్నాడు. రోహిణి అన్నపువెళ్ళ తెచ్చింది.

"ఇట్లా రావోయ్!" అన్నది రోహిణి అరుగుమీద నిలబడి.

బిచ్చగాడు అరుగు దగ్గరికి వొచ్చాడు.

ఇంట్లోనిదీపం వెలుతురు బిచ్చగాడిమీద పడుతున్నది. ఆ వెలుతురులో, బిచ్చగాణ్ణి గోవిందాచారి చూశాడు. వాడు యానాదివాడు. మధ్యాన్నం తను పనికి రమ్మని పిలిచిన యానాదివాడే. అప్పుడు డబ్బులిస్తానన్నా వాడు పని లోకి రానన్నాడు; పులిజూదం ఆడుతూ. ఈపూట మూడా కవళానికి బయలుదేరాడు. పొద్దున్నించీ కవళం లేకపోతే, తన పనిలోకి ఎందుకురాలేదు? ఎందుకు ముష్టికోసం వొచ్చాడు?

గోవిందాచారికి భయమేసింది. యానాదివాడు మహా రాక్షసుడికి మల్లే పెరిగాడు. కొండంత తల, తాడిచెట్లంత చేతులు, గుహలాంటి నోరు, పెద్దపెద్దగోళ్ళు. జ్వాలలాంటి నాలుక.

ఆ రాక్షసుడు గోవిందాచారిని చూసి నవ్వాడు. అతనికి భయమేసింది.

"అమ్మో" అని గట్టిగా అరచి, గోవిందాచారి కళ్ళు మూసుకొన్నాడు.

"అయ్యో దేవుడా! ఏమిటండీ?" అన్నది రోహిణి. యానాదివాడికి అన్నం వేసి చెయ్యి కడుక్కొంటున్నదల్లా ఆగి, అతని దగ్గరికొచ్చింది.

"నువ్వు దెయ్యానివి. భూతానివి. రాక్షసివి. పో. పో. నన్ను చంపబోకు" అని పెద్దగా అరిచాడు, గోవిందాచారి. అతనికి జ్వరం తగిలింది.

"పాపిష్టిదాన్ని, ఎండలో బైటికి తరిమి మీకు జ్వరం తెప్పించాను" అన్నది రోహిణి, అతని చెక్కిళ్ళను మెల్లిగా నిమురుతూ.